తాలాడలో అభివృద్ధి వెలుగులు



వెల్‌నెస్ కేంద్రం

సీతంపేట: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో సంక్షేమం, అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడకుండా నిధులు కేటాయిస్తుంది. సీతంపేట మండలంలోని కొండ శిఖర గ్రామమైన తాలాడలో గ్రామ సచివాలయం ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించారు. గ్రామంలో సచివాలయంతో పాటు ఆర్‌బీకే, హెల్త్ వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటుతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలన్నీ అందుతున్నాయి. అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గ్రామంలో మొత్తం 392 కుటుంబాలు ఉండగా 1492 మంది జనాభా ఉన్నారు. డీబీటీ ద్వారా రూ.6,26,54,249, నాన్ డీబీటీ ద్వారా రూ.7,76,99,885లతో అభివృద్ధి పథకాలు అమలు చేశారు. రూ.43.60లక్షలతో సచివాలయ భవనం నిర్మించారు. రైతులకు అవసరమైన సేవలందించేందుకు రైతు భరోసా కేంద్రాన్ని రూ.23.94లక్షలతో నిర్మించారు. గ్రామ స్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు రూ.28.80 లక్షలతో వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటు చేశారు.

గ్రామంలో అభివృద్ధి ఇలా..

- రూ.40లక్షలతో కోతాం బీటీ రోడ్డు నుంచి – తాలాడ రహదారి నిర్మాణం.
- రూ.70.85 లక్షలతో లంగడుగూడకు సీసీ రహదారి నిర్మాణం.
- రూ.6.30 లక్షలతో బెన్నడుగూడకు సీసీ రహదారి నిర్మాణం.
- రూ.7.60 లక్షలతో దిగువసార గ్రామానికి రహదారి వేశారు.
- రూ.3.15 లక్షలతో మూర్తిగాడి గూడకు రహదారి నిర్మించారు.
- ఉయ్యాలగూడ గ్రామానికి రూ.1.40 లక్షలతో రచ్చబండ నిర్మించారు.
- ఎగువసార గ్రామానికి రూ.1.40 లక్షలతో రచ్చబండ నిర్మించారు.
- రూ.25లక్షలతో మన బడి నాడు – నేడు కింద తాలాడ జీపీఎస్ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

రూ.20లక్షలతో మంచినీటి పథకాలు

సింగన్నడూగ, ఎగువ సారా గ్రామాలకు గ్రావిటీ ట్యాంక్, పైప్‌లైన్ వేశారు. బెన్నడుగూడ, ఉయ్యాలగూడ, వెంకటిగూడలకు బోర్‌వెల్, మోటార్ పైప్ లైన్ వేశారు.


గ్రామ సచివాలయం


రైతు భరోసా కేంద్రం


తాలాడ గ్రామానికి వేసిన సీసీ రహదారి

అభివృద్ధి సాధించాం..



గతంతో పోలిస్తే సంక్షేమ పథకాలు పక్కాగా అమలయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించి ఇంటి వద్దకే పాలన అందిస్తున్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రజలకు మంచి సేవలందిస్తున్నారు. నేరుగా నిధులన్నీ లబ్ధిదారుల ఖాతాలకే జమవుతున్నాయి.

– ఎస్.రాజయ్య, సర్పంచ్, తాలాడ

మౌలిక సదుపాయాలు మెరుగయ్యాయి



జగనన్న పాలనలో గిరిజన గ్రామాలకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించడం జరిగింది. గతంలో ఎటువంటి రోడ్లు లేవు. ఇప్పుడు ప్రతీ గ్రామానికి రహదారుల నిర్మాణం జరిగింది. మంచినీటి కోసం గెడ్డలపై ఆధార పడేవాళ్లం. ఇప్పుడు పైప్‌లైన్ ద్వారా ఇంటికి నీరు అందిస్తున్నారు.

– పి.కృష్ణారావు, సచివాలయం కన్వీనర్

మెరుగైన సేవలు



గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నాం. సమస్యలపై వచ్చిన వారికి వెంటనే పరిష్కారం చూపిస్తున్నాం. గ్రామ వలంటీర్‌లు ప్రతీ నెల ఒకటో తేదీనే పింఛన్‌లు ఇళ్లకు వెళ్లి అందిస్తున్నారు.

– ఎ.నరేంద్రబాబు, గ్రామ కార్యదర్శి

క్లుప్తంగా

ఎన్నికల కంట్రోల్ రూం ఏర్పాటు

సీతంపేట: సార్వత్రిక ఎన్నికల దృష్టిలో పెట్టుకుని పాలకొండ నియోజకవర్గానికి సంబంధించి కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు 08941- 294040 నంబరుకు ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

22 నుంచి శ్రీ సీతారామ మందిర పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆలయం

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామంలోని పెద్దవీధిలో ఈ నెల 22 నుండి 24 వరకు శ్రీ సీతారామ మందిర పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ పురోహితులు బంకుపల్లి క్రిష్ణమూర్తి శర్మ తెలిపారు. 22న దేవతా విగ్రహంలతో గ్రామ ప్రదక్షణ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 23న ప్రాతఃకాల మండల అర్చన, కుంకుమార్చనలు, సూర్య నమస్కారాలు నిర్వహించడంతో పాటు 23న విగ్రహ ప్రతిష్ఠలు, యంత్ర స్థాపనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 24న భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు


విద్యుత్ వైర్లపై పడిన చెట్ల కొమ్మలు

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురిసిన వర్షంతో పాటు వీచిన ఈదురు గాలులకు పలుచోట్ల విద్యుత్ వైర్లపై చెట్లు పడడంతో విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మండలంలోని గొట్టివలస, మరుపెంట తదితర గ్రామాల్లో విద్యుత్ వైర్లపై చెట్లు పడడంతో వాటిని తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఏఈ బి.శంకరరావు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు


సమావేశంలో పాల్గొన్న జెడ్పీ వైస్‌చైర్మన్ బాపూజీనాయుడు తదితరులు

గరుగుబిల్లి: సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు మండల ఉప ఎంపీపీ లక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సమస్యలపై చర్చ నిర్వహించలేదు. మండల సర్వసభ్య సమావేశం 90రోజుల్లోపు నిర్వహించాల్సి వున్నందున నిబంధనల మేరకు ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు ఎంపీడీఓ పి.సూర్యనారాయణ తెలిపారు. కోడ్ అమల్లో ఉన్నందున కేవలం సభ్యుల సంతకాలను తీసుకొని సమస్యలపై చర్చించకూడదన్న నియమంతో సమావేశాన్ని ముగించినట్లు తెలిపారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఉప ఎంపీపీ లక్ష్మి, ఎంపీటీసీలు బి.నారాయణమ్మ, డి.సత్యనారాయణ, సీహెచ్ రూపవతితో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన


అల్లువాడలో పోలింగ్ బూత్‌ను పరిశీలించిన తహసీల్దార్, ఎంపీడీఓ

జియ్యమ్మవలస: మండలంలోని అల్లువాడలో ఉన్న పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ కేవీ సీతారామయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ఏర్పాట్లును పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యుత్, రన్నింగ్ వాటర్ తదితర సౌకర్యాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

అమ్మవారి ఘటాల తిరువీధి

మక్కువ: కొండబుచ్చమ్మపేట గ్రామదేవత బంగారమ్మతల్లి(అమ్మవారి) ఘటాలను బుధవారం గ్రామంలో తిరువీధి నిర్వహించారు. బంగారమ్మతల్లి గద్దె వద్ద ఘటాలకు, పాలధారకు పూజారి కుటుంబీకులు అలంకరించారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ ప్రతిష్ఠ


దుర్గాదేవిని దర్శించుకుంటున్న భక్తులు

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన కుంబిడి దుర్గాదేవి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఈ మహోత్సవంలో గ్రామస్తులు పాల్గొని దుర్గాదేవికి పూజలు చేశారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ ఉమామహేశ్వరరావు, నీటి పారుదల శాఖ డీఈఈ రవికుమార్ దుర్గాదేవిని దర్శించుకుని పూజలు చేశారు.

చెక్‌పోస్టు వద్ద నిరంతర తనిఖీలు


గుణుపూర్ రోడ్డులో వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

గుమ్మలక్ష్మీపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం మండలంలోని గుణుపూర్ రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎల్విన్‌పేట పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికలు సజావుగా జరిగే విధంగా ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా ఆంధ్రా, ఒడిశా నుంచి వచ్చీపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపిస్తున్నారు. అపరిచితులు, అనుమానితుల వివరాలను కూడా సేకరిస్తున్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి


నేతల పేర్లకు పేపర్లు అతికింపజేయిస్తున్న ఎంపీడీఓ

గుమ్మలక్ష్మీపురం: ఎన్నికల నియమావళిని అమలు పర్చాలని ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్ అన్నారు. మండలంలోని కేదారిపురం గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. ఎన్నికల నియమాళిలో భాగంగా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, పార్టీల జెండాలను తీయించారు. గోడలపై ఉండే రాజకీయ నాయకుల పేర్లను పేపర్లతో మూయించారు. అనుమతి లేకుండా ఏ రాజకీయ పార్టీల నాయకులు నిరసనలు, ర్యాలీలు చేయడానికి వీలులేదని, ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని పేర్కొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు


కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

పాలకొండ: ఎన్నికల కోడ్ నేపథ్యంలో కేంద్ర బలగాలు బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో కవాతు నిర్వహించాయి. కొండాపురం, సింగన్నవలస గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ చంద్రమౌళి మాట్లాడుతూ శాంతభద్రతల పరిరక్షణే లక్ష్యంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కలిగించామన్నారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. ఎటువంటి వివాదాలకు వెళ్లకుండా ప్రజలు శాంతియుతంగా మెలగాలన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు


పాలకొండ రూరల్: లుంబూరులో సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న నోడల్ అధికారి


గరుగుబిల్లి: స్టిక్కర్లను తొలగిస్తున్న సిబ్బంది

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల నియమావళి సచివాలయాల్లో, అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అనుసరించాలని ఎన్నికల నోడల్ అధికారి, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని లుంబూరు, ఓని తదితర గ్రామ సచివాలయాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. కమిషన్ సూచించిన నిబంధనలు అమలు చేయకుంటే ఏర్పడే ఇబ్బందులపై అవగాహన కల్పించారు. అధికారులు చైతన్యవంతులై మెలగటంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

గరుగుబిల్లి: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని సంతోషపురం, గొట్టివలస, ఎర్రన్నగుడి తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించి పోస్టర్లు, బ్యానర్లు, స్టిక్కర్లను తొలగించారు.

అలాగే శిలాఫలకాలపై రంగులను వేసి కన్పించకుండా చేశారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఎన్నికల నియమావళిని అనుసరించి సహకరించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఆయనతో పాటు కార్యదర్శి టి.భాస్కరరావు తదితరులున్నారు.

దంత సంరక్షణపై విద్యార్థినులకు అవగాహన


సీతంపేట: దంత సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న వైద్య నిపుణురాలు రేణుక

సీతంపేట: వరల్డ్ ఓరల్ హెల్త్‌డేను పురస్కరించుకుని స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏరియా ఆస్పత్రి దంత వైద్య నిపుణులు రేణుక బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లిల్లీరాణి, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల తదితరులు పాల్గొన్నారు.

నోరు బాగుంటే ఆరోగ్యం బాగు

గుమ్మలక్ష్మీపురం: నోరు బాగుంటే ఆరోగ్యం బాగుంటుందని భద్రగిరి సీహెచ్‌సీ డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పావని అన్నారు. వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా బుధవారం భద్రగిరి సీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దంతాలు, చిగుళ్లకు సంబంధించి ఏ చిన్న సమస్య ఉన్న దంత వైద్యులను సంప్రదించాలని, దంత సంరక్షణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో భద్రగిరి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, వైద్యులు రమ్య, శ్రీలక్ష్మీ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురం: వరల్డ్ ఓరల్ హెల్త్ డే కార్యక్రమంలో పాల్గొన్న డెంటల్ అసిస్టెంట్ సర్జన్ ఇతర వైద్యులు, సిబ్బంది

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పాలకొండ రూరల్: వేసవిలో కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఎం.సింగుపురం సీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.రవికుమార్ అన్నారు. మండలంలోని పెద్ద కోటిపల్లి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాచి చల్లారిన నీటిని, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

సారా తరలిస్తూ...

పాలకొండ రూరల్: మండలంలోని సింగన్నవలస మీదుగా పాలకొండ పట్టణంలోకి 20 లీటర్ల సారా తరలిస్తున్న ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ ఎస్.ప్రశాంత్‌కుమార్ నేతృత్వంలో బుధవారం రూట్ వాచ్ చేపడుతుండగా సీతంపేట మండలం వజ్జాయిగూడ గ్రామానికి చెందిన సవర రామరాజు సారా తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా గ్రామ దేవత ఉత్సవాలు


ఘటాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామంలో గ్రామదేవత అగ్ని గంగమ్మ ఉత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. సుమారు పదేళ్ల తర్వాత జరుగుతున్న ఈ ఉత్సవాలు గత మూడు రోజులుగా జరుగుతున్నాయి. చివరి రోజు మహిళలు ఘటాలతో గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. ఈ ఘటాలతో గ్రామస్తులు పండ్లు, అరెసెలు, పూలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో సందడి నెలకొంది.

వేడుకగా ఆంజనేయ స్వామి ప్రతిష్ఠ మహోత్సవం


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని మరుపెంట గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఉరిటి నిర్మల, ఎంపీపీ ఉరిటి రామారావు, గ్రామస్తుల సహకారంతో నిర్మాణం చేపట్టిన ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, మండపారాధన ప్రతిష్ఠ కార్యక్రమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను గ్రామ పురోహితులు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో రుత్విక్‌లు రేజేటి నిరంజన్ కుమార్, వెంకట రమేష్, సురేష్ కుమార్ శర్మ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా లక్ష్మీగణ పతి కల్యాణ మహోత్సవం

సీతంపేట: స్థానిక జీసీసీ ఎదురుగా వేంచేసి ఉన్న లక్ష్మీగణపతి ఆలయంలో సిద్ధి, బుద్ధి సమేత లక్ష్మీగణపతి వివాహ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేమకోటి సాయికృష్ణ శర్మ, విశ్వేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి

పాలకొండ: వేసవిలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకోవాలని అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని వెంకటమ్మపేట ప్రభుత్వ పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు విన్యాసాలతో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

- ఎస్‌బీఐ విశాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్


ఎస్‌బీఐ నూతన శాఖను ప్రారంభిస్తున్న విశాఖపట్నం డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్

జియ్యమ్మవలస: ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నట్టు ఎస్‌బీఐ విశాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్ అన్నారు. జియ్యమ్మవలస మండల కేంద్రంలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు సేవలను ఈ ప్రాంతీయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు, వ్యాపార రుణాలతో పాటు ప్రతీ మహిళా సంఘానికి రూ.20లక్షల వరకు రుణసదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆశావహ మండల ప్రగతిపై చర్చ


మాట్లాడుతున్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్

భామిని: కేంద్రంలోని నీతి అయోగ్ ఆధ్వర్యంలో ఏస్పిరేషన్ బ్యాక్స్ పురోగతిపై బుధవారం మండల స్థాయి అధికారులు సమావేశమై చర్చించారు. భామిని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని 9 శాఖల అధికారులు ఆశావహ మండల ప్రగతిపై చర్చించారు. ఏస్పిరేషన్ మండలాల్లో అమలవుతున్న వైద్యసేవలు, గర్భిణులకు అందించిన పౌష్టికాహారం, నిర్మాణంలోని గృహ పథకాలపై చర్చించారు. సీడీపీఓ శాంతి భవానీ, వైద్యాధికారులు డాక్టర్ పసుపులేటి సోయల్, డాక్టర్ దామోదరరావు, ఏఈలు సందీప్, గౌరీశంకర్, ఎంఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యక్రమాలకు 'దత్తి' దూరం


టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన రోజున తన వర్గీయులతో సమావేశమైన దత్తి లక్ష్మణరావు

కురుపాం: నియోజకవర్గ టీడీపీలో వర్గపోరు తీవ్రతరమైంది. కురుపాం స్థానం నుంచి టీడీపీ తన అభ్యర్థిగా తోయక జగదీశ్వరిని ప్రకటించాక, ఆ పార్టీలో టిక్కెట్ ఆశించి భంగపడ్డ దత్తి లక్ష్మణరావు వర్గీయులు ఆ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. జగదీశ్వరి తరపున మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల విరేష్‌దేవ్ తదితరులు ప్రచారం చేస్తుండగా.. రెండో వర్గాన్ని నడుపుతున్న గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తి లక్ష్మణరావు ఆ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ తన వర్గానికి చెందిన నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇదే సమయంలో దత్తి వర్గీయుల్లో ఒకరిని రెబల్ అభ్యర్థిగా పోటీ చేయించేందుకు పావులు కదుపుతున్నారు. పార్టీ నుంచి స్పష్టమైన హామీ రాకుంటే పార్టీ కూడా మారే ఆలోచన చేస్తున్నట్టు చర్చ జరుగుతోంది.

నాడు అధ్వానం.. నేడు అద్భుతం

కురుపాం మండలంలోని గొటివాడ గ్రామస్తుల దశాబ్దాల నాటి రహదారి కష్టాలు తీరాయి. టీడీపీ హయాంలో అధ్వానంగా ఉండే రహదారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అద్భుతంగా తయారైంది. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణికి గ్రామస్తులు రహదారి కష్టాలు విన్నవించగా దీని బాగుకు చర్యలు తీసుకున్నారు. అనుకున్నదే తడవుగా రూ.కోటీ 20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులను మంజూరు చేయించి 1.6 కిలోమీటర్ల బీటీ రహదారిని మంజూరు చేసి త్వరితగతిన పనులు కూడా జరిగేలా ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. దీంతో పనులు పూర్తి చేయించారు. దీనిపై సర్పంచ్ తిమ్మక తట్టమ్మ స్పందిస్తూ దశాబ్దాల రహదారి కష్టాలు తీర్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తామంతా రుణపడి ఉంటామని తెలిపారు. – కురుపాం





రూ.కోటీ 20లక్షలతో నిర్మాణం పూర్తి చేసుకున్న నేటి బీటీ రహదారి, (ఇన్‌సెట్లో) నాడు బురదమయంతో అధ్వానంగా ఉన్న గొటివాడ రహదారి